క్లుప్తంగా

నేడు కుంచుమాంబ, దుర్గమాంబ పరస


అక్కిరెడ్డిపాలెంలో కొలువైన అమ్మవార్లు

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం గ్రామ దేవతలు శ్రీ కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరస మహోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సంద్రాన నూకరాజు, కాద సత్యారావు, కామాడ రాంబాబు, బొడ్డు రమణ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ పరసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా జరగనున్న పరస మహోత్సవంలో వివిధ రకాల స్టాళ్లతో పాటు రంగుల రాట్నాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకీ సేవ


తిరుమల బాలాజీ పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్‌టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైన శ్రీవారికి గురువారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ఉదయం తిరుప్పావడ సేవ జరిపించారు. సాయంత్రం మహిళల కోలాటాలు, భక్తుల నామస్మరణ మధ్య పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

పౌర్ణమి వేళ గిరి ప్రదక్షిణ


ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం గిరి ప్రదక్షిణ చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన ప్రదక్షిణలో భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు వేకువజామున వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా సీతారాముల పరస


తీర్థంలో స్టాళ్ల వద్ద కొనుగోలుదారుల సందడి


అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో సీతారాముల పరస మహోత్సవం కనులపండువగా జరిగింది. సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత రామచంద్ర స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. సందర్శకులతో పాటు పరసలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది. ఆలయం వద్ద దీపారాధనను నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద గరిడీ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అక్క చెల్లెమ్మలకు 'ఆసరా'

'అన్న చెప్పాడంటే.. చేస్తాడంతే..' ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గురించి జనం చెప్పే మాట ఇది. హామీ ఇస్తే ఎంత కష్టమైనా వెనక్కి తగ్గకుండా మాట నిలబెట్టుకోవడమే ఆయన నైజం. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం నవరత్నాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడమే ఇందుకు నిదర్శనం. సంక్షేమ పథకాల్లో భాగంగా మహిళా సాధికారతే లక్ష్యంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎంతో భరోసానిస్తోంది. నాలుగో విడత రుణమాఫీ నగదు ఇటీవల అందడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఆసరా చెక్కు అందుకుంటున్న మహిళలు (ఫైల్)

- నాలుగు విడతల్లో రూ.215.86 కోట్ల జమ
- స్వయం సహాయక సంఘాల మహిళల హర్షం



గాజువాక: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. అందులో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకం అతివలకు అన్నివిధాలా అండగా నిలుస్తోంది. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను విడతలవారీగా మాఫీ చేస్తానని చెప్పిన సీఎం జగన్ ఈ పథకం కింద గాజువాక నియోజకవర్గంలో అక్షరాలా రెండు వందల పది హేను కోట్ల, ఎనభై ఆరు లక్షల, నలభై ఆరు వేల ఆరు వందల ముప్పై ఎనిమిది రూపాయలను అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేశారు. మొత్తం 53,311 మంది మహిళలు లబ్ధి పొందారు. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలిపోగా.. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటినీ అమలు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

58,311 మంది మహిళలకు లబ్ధి

గాజువాక నియోజకవర్గంలో 7,756 సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో 78,000 మంది సభ్యులున్నారు. వారికి గత ప్రభుత్వం ఇచ్చిన రుణాలను మాఫీ చేస్తానన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేసి వారికి అండగా నిలిచారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద 5,355 సంఘాలకు చెందిన 53,311 మంది మహిళలు లబ్ధి పొందారు.

సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా

వైఎస్సార్ ఆసరా పథకం అర్హుల జాబితాలను ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. నియోజకవర్గంలో మొత్తం 96 సచివాలయాలున్నాయి. ఈ పథకం కింద ప్రయోజనం పొందిన లబ్ధిదారుల జాబితాలను సంబంధిత సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ఎప్పటికప్పుడు సమావేశమై ప్రభుత్వం ద్వారా ఇంతవరకు ఆసరా ఎంతమేర జమ అయింది, ఎంతమేర రుణమాఫీ అవుతుందనే విషయాలపై చర్చిస్తున్నారు. సంబంధిత అధికారులు వీటిపై అవగాహన కల్పిస్తున్నారు.

'ఆసరా' లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు
2020-21	46226	రూ. 51,04,16,947
2021-22	48289	రూ. 53,81,25,459
2022-23	50704	రూ. 54,11,40,964
2023-24	53311	రూ. 56,89,63,268
నాలుగు విడతల్లో జమ చేసిన నగదు		రూ. 215,86,46,638

రూ.5 లక్షల రుణమాఫీ



మా గ్రూప్‌లో పది మంది సభ్యులం ఉన్నాం. ఒక్కొక్కరికీ సుమారు రూ.50వేల చొప్పున మొత్తం రూ.5 లక్షల రుణమాఫీ జరిగింది. రుణమాఫీ జరగకపోతే అంతా కట్టాల్సి వచ్చేది. మాఫీ వల్ల మాకు ప్రయోజనం లభించింది. గత ప్రభుత్వంలో మాకు ఎలాంటి రుణమాఫీ జరగలేదు. కేవలం పసుపు, కుంకుమ పేరుతో కొంత నగదు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. ప్రస్తుతం రుణమాఫీ చేయడం వల్ల సంతోషంగా ఉన్నాం.

– రత్నం, వెంకట సాయిరామ పొదుపు సంఘం, మెహర్‌నగర్

మేం కట్టిన వడ్డీ కూడా వెనక్కి వచ్చింది



మా గ్రూపులో ఉన్న పది మంది సభ్యులకు రూ.7,52,000 రుణ మాఫీ జరిగింది. గతంలో మేం రెండు వేల రూపాయలు వడ్డీ చెల్లించాం. ఇప్పుడు రుణమాఫీ వల్ల ఆ డబ్బులు కూడా వెనక్కి వచ్చాయి. ప్రభుత్వ రుణంతో మాలో కొంతమంది ఆవులు, గేదెలను కొనుక్కున్నాం. దీనివల్ల ఆర్థికంగా కొంత ఆసరా దొరికింది.

– బుగిడి రామలక్ష్మి, పైడిమాంబ పొదుపు సంఘం, వడ్లపూడి

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్
- కూర్మన్నపాలెం జంక్షన్‌లో పబ్లిక్ మైక్ సిస్టమ్ ప్రారంభం


కూర్మన్నపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ నింబధనల గురించి వివరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

కూర్మన్నపాలెం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ తెలిపారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ మైక్ సెట్‌ను గురువారం ప్రారంభించిన ఆయన ట్రాఫిక్ నియమ నింబంధనలపై పలు సూచనలు చేశారు. జాతీయ రహదారిపై గాజువాక మొదలుకొని వడ్లపూడి, కూర్మన్నపాలెం, అగనంపూడి తదితర ముఖ్య జంక్షన్లలో దువ్వాడ ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ మైక్ సెట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా ప్రజలకు, ప్రయాణికులకు, వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావం

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర అంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభిమానమని, అందుకే ఇక్కడి నుంచే ఎన్నికల శంఖరావం పూరించనున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న భీమిలిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు, మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు కోమటి శ్రీనివాసరావు, ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, ఎండీ గౌస్, యువశ్రీ, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, సిరట్ల శ్రీనివాస్, దొడ్డి రమణ, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రికి ఉద్యోగి వితరణ


ఆస్పత్రి సీజీఎం డాక్టర్ ప్రకాశ్‌కు వస్తువులు అందజేస్తున్న ఉద్యోగి

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రికి బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం జనరల్ ఫోర్‌మన్ ఎస్.వి.సీతారామ్ గురువారం వస్తువులు అందజేశారు. సీతారామ్ తల్లి ఉక్కు ఆస్పత్రిలో చికిత్సతో కోలుకోవడంతో కృతజ్ఞతగా ఆయన ఎయిర్ బెడ్, నెబులైజర్ మిషన్‌ను సమకూర్చారు. వాటిని ఆస్పత్రి చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సారంగి, మెడికల్ కమిటీ సభ్యులు ముసినాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: సర్వోన్నతమైన దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకమని, అటువంటి కార్మికులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1078వ రోజు గురువారం, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మికులకు ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజలందరూ ఆందోళనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన


స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ప్రచారం చేస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద గురువారం రహదారి భద్రతా అవగాహన ప్రచారం నిర్వహించారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఉక్కు భద్రతా విభాగం, పర్యావరణ నిర్వహణ విభాగం, హార్స్‌కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై గేటు వద్ద ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో భద్రతా విభాగం జీఎం డి. రామ్‌ప్రసాద్, అధికారులు వరప్రసాద్, కృష్ణమూర్తి, పర్యావరణ నిర్వహణ విభాగానికి చెందిన బి. ప్రవీణ్‌కుమార్, గణేష్, బాపిరాజు, హార్స్‌కో ఇండియా ప్రతినిధులు సుధీర్‌కుమార్, శంకర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో వైద్యం

- ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు
- ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం
- ఎమ్మెల్యే నాగిరెడ్డి, యూపీహెచ్‌సీ వైద్యురాలు దివ్యలత
- 71, 79 వార్డుల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు


79వ వార్డులో నిర్వహించిన శిబిరంలో రోగులకు బీపీ పరీక్షిస్తున్న సిబ్బంది


సురక్ష శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది


71వ వార్డులోని వైద్య శిబిరంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


71వ వార్డులోని ఆరోగ్య సురక్ష శిబిరంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద రోగుల రద్దీ


మందులు అందిస్తున్న ఫార్మసిస్ట్ రమణబాబు

గాజువాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష వైద్య శిబిరాలు పేదల వైద్యానికి భరోసాగా నిలిచాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 71వ వార్డు సుందరయ్య కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష–2 వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అడుగులు వేశారన్నారు. శిబిరంలో వైద్యులు మొత్తం 477 మందికి వైద్య సేవలు అందించగా ముగ్గురిని రిఫరల్ ఆస్పత్రికి తరలించారు. ఉచితంగా మందులను అందజేశారు. 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, జెడ్సీ సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌రావు, స్పెషలిస్టు వైద్యులు ఎస్.విజయలక్ష్మి, పి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

79వ వార్డులో 312 మందికి వైద్యసేవలు

అగనంపూడి: నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని లంకెలపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యురాలు డాక్టర్ దివ్యలత అన్నారు. 79వ వార్డు పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లంకెలపాలెం యూపీహెచ్‌సీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ప్రజల బాగోగులు తెలుసుకోవడం, ఆరోగ్య స్థితిగతులను అంచనావేయడం, వారికి మందులు, వైద్యసేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జనరల్ సర్జన్ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ శిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. శిబిరంలో 312 మందికి వైద్య సేవలు అందించారు. పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ డాక్టర్ నాగరాజు, ఫార్మసిస్ట్ రమణబాబు, హెల్త్ సూపర్‌వైజర్ కరుణ, సిబ్బంది జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల అందజేత


గ్యాస్ కనెక్షన్‌ను అందజేస్తున్న కరణంరెడ్డి

గాజువాక: దేశంలో పేద మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లను అందిస్తోందని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఉజ్వల పథకం ద్వారా మంజూరైన వంట గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గాజువాకలో ఐదు వందల మందికి వంట గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందజేశామన్నారు. అర్హులందరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రోహిణి, నాగేశ్వరరావు, రామస్వామి, సిరసపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుతో ప్రజాస్వామ్యం పదిలం



పాతగాజువాక జంక్షన్‌లో విద్యార్థుల మానవహారం

- గాజువాక అడిషనల్ జడ్జి షణ్ముఖరావు
- ఘనంగా ఓటర్ల దినోత్సవం


80 ఏళ్లు దాటిన ఓటర్లకు సన్మానం చేస్తున్న గాజువాక అడిషనల్ జడ్జి షణ్ముఖరావు, అధికారులు


బైక్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

గాజువాక: ఓటు వజ్రాయుధమని గాజువాక అడిషనల్ జడ్జి షణ్ముఖరావు అన్నారు. దాన్ని సక్రమంగా ఉపయోగించుకోగలిగితే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లోని టీఎస్సార్ టీబీకే కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. 80 ఏళ్లు పైబడ్డ ఓటర్లకు సన్మానం చేశారు. జీవీఎంసీ, రెవెన్యూ, ఎలక్షన్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులు బైక్ ర్యాలీ నిర్వహించారు. లంకా మైదానం వద్ద ప్రారంభమైన ర్యాలీ పాతగాజువాక జంక్షన్‌కు చేరుకుని అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా శ్రీనగర్‌లోని కళాశాల వరకు అధికారులు, ఉద్యోగులు ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి, జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు శ్రీవల్లి, రమాదేవి, గాజువాక సీఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత ఎల్‌వీ నగర్ జట్టు


ఉక్కు స్టేడియం క్రికెట్ మ్యాచ్‌లో గెలిచిన ఎల్.వి. నగర్ జట్టు

ఉక్కునగరం: స్థానిక ఉక్కు స్టేడియంలో గురువారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా యారాడ, ఎల్.వి.నగర్ సెక్రటేరియట్ల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. 10 ఓవర్ల క్రికెట్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎల్‌వీ నగర్ 10 ఓవర్లకు ఆరు వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన యారాడ జట్టు 10 ఓవర్లకు తొమ్మిది వికెట్లు కోల్పోయి 64 పరుగులు మాత్రమే చేసింది. గెలిచిన ఎల్‌వీ నగర్ జట్టు ఈ నెల 29న గాజువాక సీడబ్ల్యూసీ జట్టుతో ఫైనల్స్‌లో తలపడనున్నది. పీడీలు నారాయణ, మన్నాజీల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.

మహిళలకు చైల్డ్‌కేర్ కోర్సులో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: నిరుద్యోగ/ఒంటరి మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చైల్డ్ కేర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు 18 నుంచి 38 సంవత్సరాల వయసు లోపు మహిళలు అర్హులని పేర్కొన్నారు. 8వ తరగతి చదివిన వారు ఈ కోర్సులో చేరవచ్చని సూచించారు. 3 నెలల శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. డిగ్రీ పాస్ అయిన వారికి మెడికల్ కోడింగ్ కోర్సులో శిక్షణ ఇచ్చి కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఇంటర్ బైపీసీ పాస్ అయిన వారికి బీఎస్సీ పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. పూర్తి వివరాలకు 7207953919, 7995013421 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. లేదా షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో గల కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో తమ కార్యాలయంలో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు 'సీ' అభినందనలు


గోపాలకృష్ణ గణేష్‌ను అభినందిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఎంపికైన సిహెచ్.ఎస్.ఆర్.వి.గోపాలకృష్ణ గణేష్‌ను ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అభినందించారు. నాయకులు ఉక్కు పరిపాలన భవనంలో గురువారం కలిసి శాలువా కప్పి, బొకేతో సత్కరించారు. సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.